వైభవంగా కుంకుమార్చనలు


తాంసి: కప్పర్లలో..


ఆదిలాబాద్‌రూరల్: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళ భక్తులు


జైనథ్: పాల్గొన్న మహిళలు


బోథ్: హోమంలో పాల్గొన్న భక్తులు


ఇచ్చోడ టీచర్స్‌కాలనీలో..

జిల్లాల్లోని దుర్గాదేవి మండపాల వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం మావల మండల కేంద్రం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దిమ్మ గ్రామంలో, ఇచ్చోడ మండలంలోని టీచర్స్‌కాలనీలో కుంకుమార్చన నిర్వహించారు. దుర్గామాతా వద్ద కుంకుమార్చన నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపం వద్ద లోక కల్యాణార్థం హోమం చేపట్టారు. జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. తాంసి మండలంలోని హస్నాపూర్‌లో శారదాదేవికి 56 రకాల నైవేద్యాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

– ఆదిలాబాద్‌రూరల్/బోథ్/తాంసి/ఇచ్చోడ/జైనథ్

క్లుప్తంగా

రైతులకు సహకారం అందించాలి

నేరడిగొండ: పత్తి, సోయాబీన్ పంట సీజన్‌లో రైతులకు సంపూర్ణ సహకారం అందించాలని బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఇమ్రాన్‌ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రైతుల పంటల రక్షణ, గ్రామాల్లో శాంతిభద్రత చర్యలపై విస్తృతంగా చర్చించారు. పంటల కొనుగోలు సమయంలో మోసాలు, అక్రమ లావాదేవీలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా కోరారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ గడ్డల నారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ఇప్పించండి

ఇచ్చోడ: గత మూడు నెలల నుంచి రేషన్‌కార్డు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జామిడి గ్రామానికి చెందిన కల్యాణి ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. నాకు అన్ని అర్హతలు ఉన్నా.. రెవెన్యూ సిబ్బంది కొంత మంది కార్డు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యాయానికి వచ్చిన ప్రతిసారి దరఖాస్తు చేసుకున్న జిరాక్స్ ఇవ్వమని అడుగుతున్నారు. ఏదో ఒక సామాధానం చెప్పి జాప్యం చేస్తున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి రేషన్‌కార్డు ఇప్పించాలని వేడుకున్నారు.

జీపీవోలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

సాత్నాల: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు జీపీవోలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ జాదవ్ రామారావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా విధులలో చేరిన జీపీవోలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు, పేదలు, సాధారణ ప్రజల రికార్డులు, భూభారతి దరఖాస్తులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్, పెన్షన్, వంటి ప్రభుత్వ పథకాలకు జీపీవోలను సంప్రదించాల్సి వస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ఆదిలాబాద్‌టౌన్: జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అందజేసిన రాష్ట్రస్థాయి బెస్ట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డులను జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు చిల్క సతీష్, నీలం వెంకట్‌లు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో వారిని జ్ఞాపికలను అందజేసి శాలువాతో సత్కరించారు. జటాధర సంస్థ నిర్వాహకులు అవార్డులను అందజేశారు. దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, వినూత్న రీతిలో విద్యాబోధన చేపడతామని ఉపాధ్యాయులు తెలిపారు.

కొనసాగుతున్న సమ్మె

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, దినసరి ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 18వ రోజుకు చేరింది. సామాజిక కార్యకర్త కేశవ్ సతీమణి మెస్రం వసంత మద్దతు తెలిపారు. జీవో 60 ప్రకారం నెలకు రూ. 15,600 వేతనం అమలు చేయాలని, పది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు.

తాత్కాలికంగా స్విమ్మింగ్ పూల్ మూసివేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్‌ను అక్టోబర్ 4 నుంచి 7వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు పూల్ నిర్వాహకుడు జబాడే రాష్ట్రపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కలుషితమైందని పేర్కొన్నారు. నీటిని పూర్తిస్థాయిలో తొలగించి కొత్త నీటిని నింపడం జరుగుతుందన్నారు.

'బతుకమ్మ చాలెంజ్' గడువు పెంపు

కైలాస్‌నగర్: బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ చాలెంజ్ -2025 ఎంట్రీలను పంపించే గడువును అక్టోబర్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి అక్టోబర్ 9న తెలంగాణ ప్రభుత్వ, సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో శిల్పకళా వేదికలో బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 8125834009 సంప్రదించాలని సూచించారు.

నోడల్ అధికారుల నియామకం

కైలాస్‌నగర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ అంశాల వారీగా నోడల్ అధికారులను నియమిస్తూ సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	హోదా	పర్యవేక్షించాల్సిన అంశం
కె.శ్యామలదేవి	అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)	మోడల్ కోడ్, ఖర్చులు
జి.రమేశ్	జిల్లా పంచాయతీ అధికారి	మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్
ఎ.ఫణిందర్‌రావు	డీఎల్‌పీవో, ఆదిలాబాద్	బ్యాలెట్‌బాక్సుల నిర్వహణ
శ్రీనివాస్	జిల్లా రవాణాశాఖ అధికారి,	ట్రాన్స్‌పోర్టు మేనేజ్‌మెంట్
ఎం.మనోహర్	ఎస్సీ కార్పొరేషన్, ఈడీ	శిక్షణల నిర్వహణ
రాథోడ్ రవీందర్	జెడ్పీ సీఈఓ	ఎన్నికల సామగ్రి నిర్వహణ
బి.మోహన్	జిల్లా సహకార శాఖ అధికారి	ఖర్చుల పర్యవేక్షణ
జక్కుల శ్రీనివాస్	డీవైఎస్ఓ	అబ్జర్వర్స్
రవీందర్ రాథోడ్	డీఆర్‌డీఓ	బ్యాలెట్‌పేపర్, పోస్టల్‌బ్యాలెట్
బి.తిరుమల	డీపీఆర్ఓ	మీడియా కమ్యూనికేషన్
మిల్కా	డీడబ్ల్యూవో	హెల్ప్‌లైన్, ఫిర్యాదుల విభాగం నిర్వహణ
బి.రవి, జి.శ్రావణ్	ఈడీఎం, డీపీఎం	వెబ్‌కాస్టింగ్ రిపోర్ట్స్ రిజల్ట్స్ మానిటరింగ్

'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. అనంతరం స్థానిక సంస్థ ఎన్నికలపై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, యాకుబ్‌బేగ్, జహిర్, సోన్‌కాంబ్లే జితేందర్, పవార్ దుదిరాం పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి


వివరాలు వెల్లడిస్తున్న సీఈవో శ్రీనివాస్

తలమడుగు: సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహా జనసభ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఈవో శ్రీనివాస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల, విత్తనాల అమ్మకాలు కొనుగోళ్లతో పాటు లావాదేవీలను వివరించారు. చైర్మన్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘం అర్హులైన ప్రతిఒక్కరికీ రుణాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్లు మనిరామ్ జాదవ్, సల్ల సుధాకర్, గంగారాం, ఆశమ్మ, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వృద్ధుడిని ఢీకొన్న సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. జైనథ్ మండలంలోని కూర గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు పొంగుల సాయిచరణ్ నిర్లక్ష్యంగా బైక్ నడుపుతూ ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్ ప్రాంతంలో వృద్ధుడిని ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. అటువైపు వెళ్తున్న వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ రుక్మారెడ్డి నిర్లక్ష్యంగా వాహనం నడుపుతున్నావని అడగగా, నీకెందుకంటూ సమాధానం చెప్పినట్లు తెలిపారు. దీంతో సదరు పోలీసు యువకుడిపై చెయ్యి చేసుకున్నాడని, ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం విచారణ చేపట్టి యువకుడిపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

శానిటేషన్ కార్మికులను డ్రైవర్లుగా వాడవద్దు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ శానిటేషన్ కార్మికులను డ్రైవర్లుగా వినియోగించవద్దని తెలంగాణ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్ కార్మికులను డ్రైవర్లుగా వినియోగించుకోవడం జరుగుతుందని దీంతో కార్మికుల కొరత ఏర్పడుతుందన్నారు. మిగతా కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. కార్మికులకు వెంటనే యూనిఫాం, చెప్పులు, కొబ్బరి నూనె, పల్లి పట్టీలు, గ్లౌజ్‌లు అందించాలన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, ఊషన్న, నాగరాజు, సురేశ్, శ్రీను, లక్ష్మి పాల్గొన్నారు.

సాయితేజ్ కుటుంబానికి న్యాయం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో ఇటీవల సీనియర్ల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న మండల కేంద్రానికి చెందిన సాయితేజ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విద్యార్థి సంఘాల నాయకుడు జాదవ్ సుమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. సాయితేజ్ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నారపల్లిలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడని, ఇటీవల కొంతమంది సీనియర్ల ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకోవడం అందరిని కలచివేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, విపుల్, రవి, రంగలాల్, శ్రీనివాస్ జాదవ్ పాల్గొన్నారు.

జీసీసీ మేనేజర్‌గా ఇస్తారి బాధ్యతల స్వీకరణ


ఇస్తారికి స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: గిరిజన సహకార సంస్థ జిల్లా మేనేజర్‌గా మేస్రం ఇస్తారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోదాం క్లర్క్‌గా పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించిన ప్రభుత్వం మేనేజర్‌గా ఆదిలాబాద్‌లోనే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జి మేనేజర్ రాథోడ్ గులాబ్ సింగ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికిన కార్యాలయ ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆర్డీవో కార్యాలయం మార్పు


ఆర్డీవో కార్యాలయం

కైలాస్‌నగర్: కలెక్టరేట్ భవనం మొదటి అంతస్తులో కొనసాగుతున్న ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చారు. ఇటీవల కలెక్టరేట్ మొదటి అంతస్తు ఏ సెక్షన్ బాల్కనీ పూర్తిగా కూలిపోవడం తెలిసిందే. కార్యాలయాన్ని కలెక్టరేట్ ఆవరణలోని సబ్ జైళ్ల కార్యాలయంలోకి మార్చారు. ఇక నుంచి ఇదే భవనంలో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఖరారైన సర్పంచ్ రిజర్వేషన్లు

తలమడుగు: మండలంలోని సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. తలమడుగు గ్రామ సర్పంచ్ (ఎస్సీ మహిళ), కొత్తూరు (బీసీ జనరల్), డొర్లీ (ఎస్టీ మహిళ), ఝరి (ఎస్టీ మహిళ), చర్లపల్లి (ఎస్టీ మహిళ), రత్నాపూర్ (ఎస్టీ మహిళ), కప్పర్‌దేవి (ఎస్టీ జనరల్), పూనగూడ (ఎస్టీ మహిళ), ఉమ్రీ (ఎస్టీ మహిళ), కోసాయి (ఎస్టీ జనరల్), పల్సిబి (ఎస్టీ మహిళ), పల్సి తండా (ఎస్టీ మహిళ), పల్సి కె (ఎస్టీ జనరల్), కుచులాపూర్ (ఎస్టీ జనరల్), లక్ష్మీపూర్ (ఎస్టీ జనరల్), లింగి (ఎస్టీ జనరల్), సుంకిడి (ఎస్సీ మహిళ), ఉండం (ఎస్సీ జనరల్), ఖోడథ్ (జనరల్ మహిళ), కజర్ల (బీసీ జనరల్), రుయ్యాడి (ఎస్టీ జనరల్), సకినాపూర్ (ఎస్టీ మహిళ), అర్లి కె (ఎస్టీ మహిళ) అధికారులు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలి

- చిత్తగూడ గ్రామస్తుల డిమాండ్
- ఎన్నికలు బహిష్కరిస్తామని వాగులో నిలబడి నిరసన


వాగులో నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నార్నూర్: రోడ్డు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని మాలేపూర్ పరిధిలోని చిత్తగూడ గ్రామస్తులు వాగు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చిత్తగూడ గ్రామంలో మొత్తం 60 దళిత కుటుంబాలు ఉన్నాయని, చిన్నపాటి వర్షం వచ్చినా..గాలి వీచిన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో కనీసం బైక్ వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అవ్యవసర సమయంలో ప్రమాదకంగా వాగు దాటాల్సి వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో రోడ్డు, వాగుపై వంతెన నిర్మిస్తామని పాలకులు హామీ ఇస్తున్నా.. తరువాత పట్టించుకోవడం లేదన్నారు. దళిత గ్రామాలపై అధికారులు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో శేషరావు ఘంటేవార్, బాబు వాఘ్మారే, రాము ఘంటేవార్, రోహిదాస్, రాజు, రుక్మాణి, శాంతబాయి, గిరిజబాయి, శేషుబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్లు

ఇచ్చోడ: స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీ అధికారి కృషి చేయాలని మాస్టర్ ట్రైనర్లు రాజశేఖర్, రమాకాంత్‌రావు, రమణరెడ్డిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సొనాల, సిరికొండ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. అక్టోబర్‌లో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేజ్ 1, స్టేజ్ 2 ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ స్వీకరణ, నామినేషన్ పత్రాలు పరిశీలన, నామినేషన్ ఉపసంహరన, గుర్తుల కేటాయింపులు, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు సమన్వయం పాటిస్తూనే ఎన్నికల నియమవళిని పాటించాలని కోరారు. సమావేశంలో ఇచ్చోడ ఎంపీడీవో సత్యంద్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలో సోమవారం రైతువేదికలో మండల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. శిక్షణ అధికారులుగా ప్రతాప్, శ్రీధర్ బాబు, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నామినేషన్ అభ్యర్థుల ప్రతిఒక్కరి పత్రాలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గుర్తులను కేటాయింపు విషయంలో జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాత్నాల ఎంపీడీవో రాజు, బోరాజ్ ఎంపీడీవో వేణు, బేల ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లో గిరిజనేతరులకు అన్యాయం


మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లో గిరిజనేతరులకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు సంజయ్ లహనే, ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డొంగ్రెలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్‌పై చర్చించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీల రిజర్వేషన్‌లో గిరిజనేతరులకు, ఎస్సీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. అధికంగా ఎస్సీలు, బీసీలు ఉన్న చోట జనరల్ రిజర్వేషన్లు కల్పించడం సరికాదన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి గిరిజనేతరుల జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవ్‌పూజే మారుతి, ఆరెల్లి రాజలింగు, మస్కే రాజువర్ధన్, మీర్జా జిలానిబేగ్, మహ్మద్ అంజద్, షేక్ సుఫీయన్, శివకుమార్, గణేష్ తహేరే, గణేష్ డొంగ్రె పాల్గొన్నారు.

విజయదశమి వేడుకలు విజయవంతం చేయండి


పనులు ప్రారంభిస్తున్న సమితి ప్రతినిధులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 2న నిర్వహించే విజయదశమి వేడుకలను విజయవంతం చేయాలని సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి పిలుపునిచ్చారు. సోమవారం మైదానంలో వేడుకల ఏర్పాట్లను భూమిపూజ చేసి ప్రారంభించారు. వేద పండితులు సంతోష్ శర్మ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా సమితి ఆధ్వర్యంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గెడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, కందుల రవీందర్, వెనుగంటి ప్రకాష్, మహిపాల్, శశికళ చౌహాన్, బొర్ర రమేశ్, బానోతు కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంపీ పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో సోమవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ జాదవ్ ప్రతాప్ కుటుంబసభ్యులను పరామర్శించారు. నాలుగు రోజుల కిత్రం జాదవ్ ప్రతాప్ భార్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగఢ సానుభూతి తెలిపారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన జాదవ్ రవిని మండలంలోని కొత్తగూడ గ్రామంలో లంబాడా జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. నాయకులు బానోత్ జగన్ నాయక్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్ నాయక్, దినేష్ చవాన్, జైవంతరావు ఉమేష్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని తర్నం(కె) గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, వాణి, గంగామణి పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

ఉట్నూర్‌రూరల్: నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన జాదవ్ నవనీత్‌కు ఉన్నత విద్య కోసం ప్రోత్సాహకంగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ల్యాప్‌ట్యాప్ అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

వైద్యశిబిరం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ పర్యవేక్షించారు. మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు.

గుంతలు పూడ్చివేత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న ఉట్నూర్ మంచిర్యాలకు వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గమనించిన మాలగూడకు చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గుంతలను పూడ్చారు.

కుల నిర్మూలనకు కృషి చేద్దాం

ఆదిలాబాద్‌రూరల్: జ్యోతిబా పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నిషాన్‌ఘాట్ జిల్లా సదస్సు నిర్వహించారు. నాయకులు అశోక్, సాయి, రాకేశ్, నితిన్, రాజేశ్వర్, లక్ష్మి, జంగు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం బృందాలు

ఆదిలాబాద్‌టౌన్: మహిళల రక్షణ కోసం షీటీం బృందాలు ఉన్నాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి, శారద దేవి మండపాలను సోమవారం రాత్రి సందర్శించారు.